





నరసన్న.. చూడన్నా!

అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం ఆదివారం వశిష్ట గోదావరిలో కన్నుల పండువగా సాగింది.. వేలాదిగా భక్తజనం హాజరై స్వామిని కన్నులారా తిలకించారు.. చల్లంగ చూడు నరసన్న అంటూ కొలిచారు..



ఊరేగిన వెంకన్న..

ఆ స్వామి వైభవాన్ని చూడడానికి రెండు కన్నులూ చాలవు.. అంతలా వాడపల్లి వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం ఆదివారం గౌతమి గోదావరిలో నిర్వహించారు. అందంగా అలంకరించిన తెప్పపై స్వామి ఊరేగారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.



సత్యదేవ.. కనవా!

అన్నవరం సత్యదేవుడి హంస వాహనం ఆకట్టుకుంది.. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి తెప్పోత్సవం పంపానదిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.

బతుకులపై హాల్‌సెల్!



ప్రస్తుతం సెల్‌ఫోన్ చాలా ప్రమాదకరంగా తయారైంది.. అది చేతిలో ఉంటే అన్నీ ఉన్నట్టే.. ఫ్రెండ్స్ కావాలంటే ఫ్రెండ్స్‌ని ఇస్తోంది.. ప్రేమికుడు కావాలన్నా.. ప్రేమికురాలు కావాలన్నా క్షణాల్లో ఇచ్చేస్తోంది.. అవి కాకుండా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, షేర్‌చాట్ తదితర యాప్‌లు ఉన్నాయి.. ఈ సెల్‌ఫోన్‌కు యువత బానిసగా మారిపోతున్నారు.. గంటల తరబడి చాటింగ్‌లు.. గంటల తరబడి టాకింగ్‌లు.. గంటల తరబడి ఆటలు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నోఎన్నెన్నో.. చదువును వదిలేసి మరి ఆ మాయలో మునిగితేలుతున్నారు.. తెలిసీతెలియని వయసులో యువతకు అదో ప్రేమమార్గంగా ఉంది.. అది కట్టడి చేయడానికి తల్లిదండ్రులు శతవిధాలా ప్రయత్నిస్తున్నా అందులో చిక్కుకుపోయే యువతే ఎక్కువ.. సెల్ ఫోన్ ఎంత అవసరమో.. అంతే నాశనం కూడా చేస్తుందనేది జగమెరిగిన సత్యం.

జీవితంపై అలక్ష్యం!



ప్రస్తుతం ఒక లక్ష్యం పెట్టుకుని చదివే యువత చాలా తక్కువ శాతం కనిపిస్తున్నారు.. తల్లిదండ్రుల పోరు తప్ప.. ఏదో ఒకటి సాధిద్దాం అని చదువుకునే యువతరాన్ని వేళ్లపై లెక్కించవచ్చు.. తెలిసీతెలియని వయసులో ఆశలు.. కోరికలంటూ పరుగులు పెడుతున్నారు.. ఆశయాలను వదిలేస్తున్నారు.. బడి దగ్గర నుంచి కళాశాలల వరకూ ఎన్నెన్నో ప్రేమకథలు.. జీవితంలో ఏదో ఒకటి సాధించిన తరువాత ప్రేమించుకుంటే తప్పులేదు. కానీ ఏమీ లేకుండా ప్రేమ అంటున్నారు.. ఆ దోమ కుట్టడంతోనే అన్నీ గాలికే వదిలేస్తున్నారు.. ఆ ప్రేమ మోజులో పడి మోసపోయిన బాలికలు కోకొల్లలు.. మన జిల్లాలోనే చూస్తే ఏడో తరగతి చదివే బాలికలు గర్భవతులు.. ఇంజనీరింగ్ చదివే అమ్మాయి మోసపోతూనే ఉంటున్నారంటే పరిస్థితి ఎంత చేయి దాటుతుందో అర్థం చేసుకోవచ్చు.

కోరికల ఊబిలో చిక్కుకుని..



కోరికలే గుర్రాలైతే.. అనే సామెత ఒకటుంది.. ఇది అమ్మాయికైనా.. అబ్బాయికైనా ఒక్కటే.. కోరికలు ఉండవచ్చు కానీ మితిమీరకూడదు.. ప్రస్తుతం కోరికలు మితిమీరిపోతున్నాయి. అవే యువతీ యువకులను.. బాలికలను పక్కదారి పట్టిస్తున్నాయి.. చాలా మంది బాలబాలికలు హీరోహీరోయిన్లను ప్రేమిస్తారు. వారిలా ఉండాలని తహతహలాడతారు.. అది చాలా ఖర్చుతో కూడుకున్నది.. ఆర్థిక అవసరాలకు చాలా మంది బాలికలు పక్కదారి పడుతున్నారు.. అదే వ్యసనంగా మార్చుకుంటున్నారు.. చదువుకున్నా ఏం చేసినా అదే ఆలోచన.. చదువును పక్కన పెట్టి ఎంతో మంది బాలికలు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువుకునే వయసులో చదువుకుంటే భవిష్యత్ చాలా అందంగా ఉంటుంది. అది చాలా ఆలోచించకుండా కోరికలనే ఊబిలో చిక్కిపోతున్నారు.

చదువుకునేందుకు ఊరు కాని ఊరొచ్చింది.. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూనే విద్యనభ్య సిస్తోంది.. సెల్‌ఫోన్‌లో పరిచయం ఒక యువకుడిని అన్నగా చెప్పుకునే వరకూ వెళ్లింది.. దీపావళి ముందు రోజు ఆ అన్నయ్య వచ్చాడు.. దీపావళి బాణసంచా కొని ఇస్తానని చెప్పి తీసుకెళ్లాడు. అన్నయ్య కదా అని నమ్మి వెళ్లింది. రెండు గంటల తరువాత ఒంటిపై గాయాలతో తిరిగొచ్చింది. అనుమానం వచ్చిన వార్డెన్ ఆరా తీస్తే.. జరిగింది చెప్పి గొల్లుమంది.. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ సంఘటన సెల్‌ఫోన్ పరిచయం ఎంత ప్రమాదకరమో చెబుతోంది.

ఆ బాలిక 7వ తరగతి చదువుతోంది.. తెలిసీ తెలియని వయసు.. అందునా అమ్మా నాన్న లేరు.. అమ్మమ్మ వద్ద ఉండి గురుకులంలో చదువుకుంటుంది.. అమ్మమ్మ ఊరికే చెందిన తాత వయసున్న వ్యక్తి ఆ బాలికను పరిచయం చేసుకున్నాడు.. బాలికకు ఎవరూ లేకపోవడంతో ఖాళీ ఉన్నప్పుడల్లా అతను వెళ్లేవాడు.. గురుకులంలో తాతగా చెప్పుకుని బయటకు రమ్మనేవాడు. బాలిక ఊరే కావడంతో అతనితో వెళ్లేది.. అలా నాలుగుసార్లు వెళ్లింది.. నాలుగోసారి అతనిలో వికృత రూపం బయటపడింది.. తెలిసినా బాలికలు ఒకరి వెంట వెళ్లడం ఎంత ప్రమాదకరమో తునిలో జరిగిన ఈ సంఘటన రుజువు చేస్తోంది.

- రాజమహేంద్రవరం/ కాకినాడ-ఆంధ్రజ్యోతి

నమ్మొద్దు.. నమ్మొద్దు!

అమ్మాయిలు జాగ్రత్త



స్వాతంత్ర్యం.. స్వేచ్ఛ.. రెండిటికీ మధ్య యోజనాల వ్యత్యాసం ఉందని పెద్దలు చెప్పే మాట అక్షర సత్యమని ఛిద్రమవుతున్న బాలికలు/అమ్మాయిల జీవితాలు రుజువు చేస్తున్నాయి. రకరకాల కారణాలతో ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్నారు. తమంతట తాముగా వెళ్లి జీవితాలను, తల్లిదండ్రుల ఆశలను ఛిద్రం చేసే వలకు చిక్కు తూ..చిక్కుముడుల సుడిగుండంలో ఇరుక్కుంటున్నారు. తీరా సున్నితమైన గీత దాటామని గ్రహించే సరికి జీవి తాలు వేరొకరి వాంఛల గుప్పిట్లో బందీలవుతున్నాయి. బంధువులు సైతం కీచకులుగా మారుతున్నారు. 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' అని ఎంత బోధిస్తున్నా ఫలితాలు పెద్దల రోదనలకు సమాధానం చెప్పలేకపోతున్నాయి.

6 వేల మంది చిట్టిగర్భవతులు

పెరుగుతున్న అత్యాచార కేసులు

బలైపోతున్న బాలికలు

అవగాహన లేక మోసపోతున్నారు

బాలికలు కౌమార దశలో గర్భం దాల్చుతూ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు వాళ్ల 2023 నుంచి ఇప్పటి వరకూ 6 వేల మంది గర్భం దాల్చారనే గణాంకాలు సమాజాన్ని హెచ్చరిస్తున్నాయి. 2016 నుంచీ గత డిసెంబరు వరకూ మిస్సింగ్ కేసులు పరిశీలిస్తే.. ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరిలో బాలలు 21, బాలికలు 70 మంది ఉన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే పదుల సంఖ్యలో పోక్సో కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 12 ఏళ్లలోపు 45, 16 ఏళ్ల లోపు 35, 18 ఏళ్లలోపు బాలికలు 20 మంది తప్పిపోవడం లేదా ఇళ్ల నుంచి వెళ్లిపోవడం జరిగింది. గతేడాది 18ఏళ్ల పైబడిన వారిపై 23, 18 ఏళ్ల లోపు అంటే పిల్లలపై 43 అత్యాచార కేసులు నమోదయ్యాయి.ఈ 43 కేసుల్లో ఓ ఏడు తప్పా.. 36 ప్రేమ పేరుతో పరారైనవే కావడం గమనార్హం. ఇక ఆ 23 కేసుల్లో నాలుగు తప్పా మిగతా వాటిలో పెళ్లి చేసుకుంటామని చెప్పినవి ఉన్నాయి. ఈ ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరిలో ఇప్పటి వరకూ వందకుపైగా బాలి కలపై అత్యాచారం కేసుల సంఘటనలు ఉన్నాయి.

తల్లిదండ్రుల అప్రమత్తతే శ్రీరామరక్ష

తల్లిదండ్రుల అప్రమత్తత, ప్రవర్తనే పిల్లల పాలిట శ్రీరామరక్ష. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల నిఘా కచ్చితంగా ఉండాలి. తమ పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు? ఎవ రితో ఎక్కువగా మాట్లాడుతున్నారు? స్కూలు/కాలేజీకి వెళ్లేటప్పుడు విద్యార్థినులేం చేస్తున్నారు? దారి మధ్యలో పెత్తనాలు ఏవైనా చేస్తున్నారా ఇలాంటి విషయాలన్నీ గమనించాలి. హాస్టళ్లలో ఉండే తమ ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత వారిదే. హాస్టళ్లలో పరిస్థితులు, తమ చిన్నారి ఎలా ఉంటోంది అనే విషయాలపైనా ఆరా తీయాలి. ముఖ్యంగా తమకు దూరంగా ఉండే పిల్లలతో ప్రేమగా మెలగాలి. వారి మనసులో బాధను తెలుసుకోవాలి. ఏం జరిగినా తమకు చెప్పాలనే భరోసా తల్లిదండ్రులు కల్పించాలి. తాము ఉన్నామనే ధైర్యం ఇవ్వాలి. సాధారణంగా 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉరకలు వేసే వయసు కావడంతో దారితప్పే అవకాశం ఎక్కువ.అందువల్ల తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పాఠశాలల్లో టీచర్ల వ్యవహారశైలి.విద్యార్థినులతో ప్రవర్తన గమనించాలి.

అధికారులేం చేస్తున్నారు..

ఇటీవల పోలీస్‌శాఖ, చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో పాఠశాలలు,కళాశాలల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి విధించే శిక్షలు, అపరిచిత వ్యక్తులతో పాటు చుట్టుపక్కల సమాజంలో ఎలా మెలగాలి అనే విషయాలపైనా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు. లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు ఫోన్ చేసి తల్లిదండ్రులు సమాచారం ఇవ్వాలి.. జాప్యం జరిగే పరిస్థితి విషమించే అవకాశం ఉంది.

పిల్లల ప్రవర్తన గమనిస్తుండాలి

పిల్లల ప్రవర్తన తల్లిదండ్రులు గమనిస్తుండాలి.. సెల్‌ఫోన్ ఇస్తే నిఘా ఉండాలి. సోషల్ మీడియా ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం పరిశీలించాలి. హెయిర్ కటింగ్, నడవడిక, దుస్తులు వంటివి మంచిగా ఉండేట్లు చూసుకోవాలి. ఆడపిల్లలు ఒకవేళ ఎవరి ట్రాప్‌లో అయినా ఉండి మాట వినకపోతే వెంటనే పోలీసులకు చెప్పాలి. మేం కౌన్సె లింగ్ ఇస్తాం. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. స్కూలులో పిల్లలకు నైతిక విలువలు, మంచి నడవడిక గురించి నూరి పోస్తుండాలి.అందరం కలిసి ఆడపిల్లలను రక్షిద్దాం.

- డి.నరసింహ కిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి



నైతిక విలువలు పెంచండి

తల్లిదండ్రులు పిల్లల ర్యాంకుల చుట్టూ పరుగులు పెడుతున్నారు. నైతిక విలువలు చెప్పే వారు లేరు. ఆ తరగతి గదులూ మాయమయ్యాయి. ఇవన్నీ కలిసి పిల్లలు నడిచే తీరును వక్రమార్గంలోకి తీసుకెళ తున్నాయి. విద్యా విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహభావంతో మెలగాలి. నీతి కథ లు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు నూరిపోయాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి,
ప్రముఖ మానసిక వైద్య నిపుణులు



నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అమలాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామని కలెక్టర్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గత అర్జీలు పరిష్కారం కాకపోయినా,ఫిర్యాదుల సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబరుకు కాల్ చేయవచ్చునని స్పష్టంచేశారు.గోదావరిభవన్‌లో జరిగే కార్యక్రమం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు.

భద్రతా ప్రమాణాలు లేకుంటే బస్సులు సీజ్

» జిల్లా రవాణాధికారి



బస్సు తనిఖీ చేస్తున్న ఆర్టీవో శ్రీనివాస్

ముమ్మిడివరం,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ట్రావెల్ బస్సు మోటారు వాహనాల చట్ట నిబంధన ప్రకారం భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని, లేకుంటే సీజ్ చేస్తామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల జిల్లాలో 57 బస్సులు తనిఖీ చేసి వాటిలో భద్రతా ప్రమాణాలు పాటించని 8 బస్సులను సీజ్ చేసి వాటి ఫిట్‌నెస్‌ను రద్దుచేశామన్నారు. యానాం నుంచి అమలాపురం మీదుగా హైదరాబాద్ వెళ్లే ప్రతి ట్రావెల్ బస్సు భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. తనిఖీల్లో భద్రతా ప్రమాణాలు పాటించని జయంతి ట్రావెల్స్ బస్సును సీజ్ చేసి ఫిట్‌నెస్‌ను రద్దు చేశారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సాధారణ వేగంతో వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ ఉన్నారు.

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలి

» ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సత్యనారాయణ

అమలాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 2010 కంటే ముందు నియామకమైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. అలా మినహాయింపు ఇచ్చేలా చట్టసవరణలు జాతీయస్థాయిలో తమ సంఘం ప్రయత్నిస్తుందన్నారు. అమలాపురంలోని ఈదరపల్లిలో ఉన్న జనహిత కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి ఆపస్ సంఘ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ టెట్‌పై ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ అర్హత మార్కులు సాధించే విషయంలో సమానత్వ నియమం పాటించాలన్నారు. త్వరలోనే కూటమి ప్రభుత్వం విద్యార్థి కమిషన్‌ను నియమించి ఐర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి వీవీ శాస్త్రి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు అదేరోజున ఆర్థిక ప్రయోజనాలను అందించాలన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం రాష్ట్రంలో ప్రభుత్వపరంగా బీఈడీ కోర్సులు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాడ్రేవు శ్రీనివాస్, పి.నరేష్‌బాబు, కాకినాడ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వీఎస్ చలపతి, సీహెచ్‌ఎస్ శ్రీనివాస్, తూర్పుగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలు డి.గిరిజ, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామగణేష్, రాఘవు ప్రసంగించారు. ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రామచంద్రపురానికి చెందిన పోలిశెట్టి సత్యనారాయణమూర్తిని ఎంపిక చేశారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



వివిధ పోలీస్‌స్టేషన్లలో రౌడీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

అమలాపురం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రాహుల్ మీనా రౌడీషీటర్లపై కొరడా ఝులిపిస్తున్నారు. నేర ప్రవృత్తికి వారు స్వస్తి పలకాలనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగాఉన్న పోలీస్‌స్టేషన్లలో కొందరికి ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరనియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్నిస్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు.రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ పోలీసులను ఆదేశించారు. భవిష్యత్తులో ఎవరైనా చట్టాలను ఉల్లంఘించినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా వారిపై కఠినచర్యలు తీసుకోవడంతోపాటు రౌడీషీట్‌ను రద్దు చేయకుండా కఠినంగా వ్యవహస్తామన్నారు.నేరాలవల్ల కలిగే పర్యావసానాలు,కుటుంబీకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, వాటిని ఉల్లంఘించి కార్యకలాపాల్లో పాల్గొంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్నిస్టేషన్లలోను కౌన్సెలింగ్ నిర్వహించారు.

తీరం కోత





» తుఫాన్ ప్రభావంతో ఎగసిపడిన సముద్ర అలలు

» అంతర్వేదిలో కోతకు గురైన రక్షణ గట్టు

అంతర్వేది సముద్ర తీరం వద్ద కోతకు గురైన రక్షణ గట్టు

అంతర్వేది, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సముద్రతీరం కోతకు గురవుతోంది. సఖినేటిపల్లి మండలం అంతర్వేది తీరప్రాంత గ్రామాల్లో ఇటీవల స్వచ్ఛందంగా రైతులు, పంచాయతీ ఏర్పాటు చేసిన రక్షణ గట్టు కోతకు గురైంది. సముద్రాన్ని ఆనుకుని ఉన్న నాలుగు గ్రామాలు అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం, కేశవదాసుపాలెంల్లో మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావాన్ని చూపింది. సముద్రపు నీరు గ్రామాల్లోకి చొచ్చుకుని రాకుండా వేసిన గట్టు పూర్తిగా ధ్వంసమై ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయి. సముద్రపు అలలు పంటపొలాల్లోకి చొచ్చుకు వచ్చి తీరప్రాంతంలో ఉన్న వేలాది ఎకరాలు కొబ్బరి, సరుగుడు తోటలు తీవ్రనష్టం ఏర్పడింది. సముద్రపు పోటునీరు గండ్లు పడ్డ చోట నుంచి గ్రామాల్లోకి చొచ్చుకు రావడంతో ఇంకా అంతర్వేది పరిసర ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ నీరు చేరి ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే అంతర్వేది పరిసర ప్రాంతాల్లో నివాస యోగ్యాలకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడనున్నట్టు స్థానికులు వాపోతున్నారు. తరచూ ముంపునకు గురవుతూ తీరప్రాంత గ్రామాలు ఇక్కట్లకు గురవుతున్నారు. అంతర్వేది, అంతర్వేది దేవస్థానం సరిహద్దు ప్రాంతంలో కొందరు రైతుల సహకారంతో ముంపు నీటిని మోటారు సాయంతో బయటకు తరలిస్తున్నారు. ఎగువ గ్రామాల నుంచి దిగువ గ్రామాలకు రావడంతో ముంపు నీరు అంతర్వేది ప్రాంతంలోనే తిష్టవేసుకుని కూర్చొంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓడలరేవులో ముందుకు వచ్చిన సముద్రం

అల్లవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అల్లవరంలో సముద్ర తీరం కోతకు గురవుతూ నీరు ముందుకు వస్తోంది. భారీ అలల తాకిడికి అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం సముద్రతీర ప్రాంతాల్లో కిలోమీటరు మేర భూమి సముద్ర గర్భంలో కలిసిపోయింది. ఏళ్ల తరబడి భూమి కోతకు గురవుతున్నా రక్షణ చర్యలు లేవన్న విమర్శలున్నాయి. సముద్ర తీరం వెంబడి అనధికార ఆక్వా చెరువులను అరికట్టడంలో రెవెన్యూశాఖ వైఫల్యం అవుతోందన్న ఆరోపణలున్నాయి. తీరం నుంచి ఇసుక తోలకాలు కూడా పెరిగాయి.

ఆకాశాన్నంటుతున్న.. కూరగాయల ధరలు



» కార్తీకమాసంలో భారీగా పెరుగుదల

» భారీవర్షాలకు దెబ్బతిన్న పంటలు.. తగ్గిన ఉత్పత్తి

అంబాజీపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. కార్తీకమాసం, వనభోజనాల సందడి, అయ్యప్ప మాలధారులతో ఆధ్యాత్మిక చింతన నెలకొంటుంది. వర్షాల ప్రభావంతో ఇతర ప్రాంతాల నుంచి ఉత్పత్తి తగ్గడంతో కార్తీకమాసంలో కూరగాయల ధరలు భారీ పెరిగాయి. అల్లం ధర ఆకాశాన్ని అంటుతోంది, వంకాయ ధర వణుకు పుట్టిస్తోంది, చిక్కుడుకాయ చిక్కనంటోంది, కాకరకాయ కాక రేపుతోంది, క్యాబేజీ, క్యారెట్, దోసకాయ, ఆనపకాయ కలవరపెడుతున్నాయి. ఇలా కార్తీకమాసంలో కూరగాయల ధరలు ప్రజలను బాధిస్తున్నాయి. ధరల పెరగడంతో ఏది కొందామన్నా సామాన్యుడు భయపడిపోతున్నాడు. బహిరంగ మార్కెట్‌లో ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.50పైమాటే. కార్తీకమాసం ముగిసే వరకు కూరగాయల ధరలు దిగిరావని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నెల రోజుల అత్యధికంగా కూరగాయల వినియోగం ఉంటుంది. అయ్యప్పదీక్షలు, శివ మాలధారులు, భవానీ దీక్షలు, అన్నసమరాధనాలు ఉన్న నేపథ్యంలో ధరలు కొనసాగే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవి అధిక ధరలు

మార్కెట్లో చిక్కుడుకాయలు రూ.160, వంకాయలు రూ.100, బెండకాయలు రూ.100 పైబడి విక్రయిస్తున్నారు. క్యారెట్ రూ.70, మునగ రూ.70, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయలు రూ.60, బీరకాయ రూ.80, టమాట రూ.60, ఆకుకూరలు కట్ట రూ.20పైబడి ఉన్నాయి.

లోపలి పేజీల్లో..

అన్నీ తానైన కోడలు

» ఇంట్లో మగవాళ్లు లేకపోవడంతో అత్తకు అంతిమ సంస్కారాలు

» ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో ఘటన

ప్రాణం తీసిన అతివేగం

» విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి.. మరొకరికి గాయాలు

» పి.గన్నవరం మండలం మొండెపులంక లాకు వద్ద ఘటన



నయనానందకరం.. నౌకావిహారం

● పంపా సరోవరంలో ఘనంగా సత్యదేవుడి తెప్పోత్సవం ● తరించిన భక్తజనం

తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, భక్తులు







స్వామి,అమ్మవార్లను తీసుకొచ్చి హారతి ఇస్తున్న పండితులు, నృత్య ప్రదర్శన

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రత్నగిరివాసుడైన సత్యదేవుడి నౌకావిహారం ఆదివారం భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ నయనానందకరంగా జరిగింది. అనంతలక్ష్మి సమేతుడైన స్వామి పచ్చనికొండల నడుమ పంపా హొయలలో హంసవాహనంపై ముమ్మార్లు విహరించగా ప్రకృతి పరవశించింది. విద్యుద్దీపఅలంకరణలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ ఆహ్లాదభరిత వాతావరణంలో ఈ కమనీయ వేడుక ఘనంగా జరిగింది. సాయంత్రం 5గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను.. క్షేత్రపాలకులైన సీతారాములను పల్లకీలో ఘాట్‌రోడ్డు గుండా బాజాభజంత్రీలు, వేదమంత్రాల నడుమ పంపాసరోవర తీరంవద్దకు తోడ్కొనివచ్చారు. వివిధ సుగంధ భరిత పుష్పమాలికలతో తీర్చిదిద్దిన ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంత లక్ష్మి అమ్మవార్లను, మరో వేదికపై సీతారాములను ఆశీనులు గావించి పండితులు వేదస్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు చామర్తి వెంకటరెడ్డి పంతులు, పాలంకి పట్టాభి తదితరులు గణపతిపూజ, పుణ్యాహవచనం శ్రీసూక్త, పురుషసూక్త విధానంలో కృతువు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక వద్ద అర్చకస్వాములు తులసిధాత్రి పూజను జరిపించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి,అమ్మవార్లను పంపాతీరం వద్ద ప్రత్యేకంగా తయారుచేయించిన హంస వాహనంపైకి తీసువెళ్లి మరోమారు పూజలు అనంతరం 3పర్యాయాలు పంపా సరోవరంలో నౌకావిహారం గావించారు. అనంతరం చతుర్వేదపండితులు మహాదాశీర్వచనం అందజేయగా భక్తులకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

ఆనవాయితీగా వేడుక...

ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు పాలకడలిలో శయనించి భాద్రపద ఏకాదశి (పరివర్తన ఏకాదశి) రోజున ఒకపక్కకు ఒదిగుతారు కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్దిద్వాదశి రోజున శ్రీ మహావిష్ణువు మేల్కొనడానికి ప్రతీకగా విష్ణుస్వరూపుడైన సత్యదేవుడికి ఈ వేడుకను జరపడం ఆనవాయితీగా వస్తుంది.

ప్రత్యేక ఏర్పాట్లు

సాధారణ భక్తులు తిలకించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేయగా ప్రముఖులు నౌకావిహారం చూసేందుకు తీరం వద్ద ప్రత్యేక గ్యాలరీ, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టగా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాలతో ప్రత్తిపాడు సీఐ, అన్నవరం ఎస్‌ఐ బందోబస్తు నిర్వహించారు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో హంస వాహనంపైకి ముందుగా అనుకున్న 18 మంది వైదికబృందాన్ని 12 మందికి కుదించారు. ముందుజాగ్రత్త చర్యగా పంపా సరోవరంలో హంస వాహనం తిరిగే దూరాన్ని తగ్గించారు.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుడి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

6200 జంటలు సత్యవ్రతాలు

రూ.65 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస రద్దీ ఆదివారం కొనసాగింది. సెలవుదినం, క్షీరాబ్దిద్వాదశి పర్వదినం కావడంతో అశేషసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒం టిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఉదయం 9 గంటలవరకు సాధారణంగా ఉన్న భక్తజనం 9 దాటిన తరువాత పోటెత్తారు. భక్తులకు ఎటువంటి అ సౌకర్యం కలగకుండా చైర్మన్ ఐవీ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్ వద్ద, ఈవో వీర్ల సుబ్బారావు కమాండ్ కంట్రోల్ రూంలో ఉండి పర్యవేక్షించారు. రద్దీ ఆధారంగా అంత్రాలయ దర్శనానికి అనుమతించారు. స్వామివారి ప్రత్యేకదర్శనానికి 2గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉన్నారు. ఆదివారం 6200 జంటలు వ్రతాలాచరించుకోగా వివిధ విభాగాల ద్వా రా సుమారు రూ.65 లక్షల ఆదాయం లభించింది. కార్తీక సోమవారం భక్తుల రద్దీకణుగుణంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సత్యజ్యోతి ఊరేగింపు

క్షీరాబ్దిద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ఉదయం సత్యజ్యోతి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను గ్రామశివారున ఉన్న సుబ్బరాయపురం సాక్షిగణపతి ఆలయం వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు అనంతరం అక్కడ వెలిగించిన సత్యజ్యోతిని గ్రామంలో సత్యదీక్షాపరులు, అయ్యప్పమాలధారులతో గోవిందనామస్మరణల నడుమ ఊరేగింపు నిర్వహించి కొండపై కళామందిరంలో సత్యజ్యోతిని భక్తుల కోసం ఉంచారు.



సత్యజ్యోతి ఊరేగింపు నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

'లోవ'లో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.1.48 లక్షల ఆదాయం

తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబసమేతంగా భోజనాలు చేశారు. ఆలయానికి రూ.1.48 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవో విశ్వనాధ్ రాజు తెలిపారు.



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు



క్యూలో బారులు తీరిన భక్తులు

వైభవంగా క్షీరాబ్ధి ద్వాదశి వేడుకలు

గోదావరిలో విహరించిన వాడపల్లి వెంకన్న

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఆదివారం క్షీరాబ్ధి ద్వాదశి (చిలుకు ద్వాదశి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో అధి రోహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మేళతాళ మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి గౌతమి గోదావరి నదీలో హంస వాహనంలో కొలువుతీరిన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అర్చన, చతుర్వేద స్వస్తి అర్చక బృందం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి హంస వాహనంలో గోదావరిలో మిరుగొట్లు గొలిపే విద్యుత్ కాంతుల నడుమ వేదమంత్రాల సాక్షిగా విహరించారు. అశేష భక్తజనం పాల్గొని తన్మయత్వం పొందారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.





వాడపల్లిలో గౌతమి గోదావరిలో హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు, పూజలు చేస్తున్న అర్చకులు

అంతర్వేదిలో తెప్పోత్సవం

అంతర్వేది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసంహస్వామి వారి ఆలయంలో ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కంచుగరుడ వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి-అమ్మవార్లను ఊరేగింపుగా బాణసంచా కాల్పులు, కేరళ వాయిద్యాల నడుమ పల్లిపాలెం గ్రామంలోకి శాస్త్రోక్తంగా తీసుకెళ్లారు. వశిష్ట రేవులో తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అంతర్వేది పల్లిపాలెం వశిష్ట రేవులో ప్రారంభమైన తెప్పోత్సవం గొంది గ్రామానికి చేరుకుని తిరుగు ప్రయాణంలో రాత్రి అంతర్వేదికి చేరుకుంది. అనంతరం ద్వాదశ మండపానికి చేరుకున్న స్వామి,అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు.



అంతర్వేది వశిష్ట రేవులో హంస వాహనంపై స్వామివారికి తెప్పోత్సవం





పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువకు పడిన గండ్ల నుంచి వరద ప్రవాహం, ముంపులో వరి చేను

తగ్గుతున్న 'ఏలేరు' వరద

» అవుట్‌ఫ్లోస్ 3,175 క్యూసెక్కులు

» ఇంకా ముంపులోనే పంట పొలాలు

పిఠాపురం/ ఏలేశ్వరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏలేరు వరద ఉధృతి తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోస్ తగ్గడంతో ఆ మేరకు అవుట్‌ఫ్లోస్‌ను తగ్గించారు. అయితే పంట పొలాల్లో మాత్రం వరద నీరు కొనసాగుతోంది. నీరు తగ్గేందుకు మరో రెండు, మూడు రోజులు పడుతుందని రైతులు చెప్తున్నారు.

ఏలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు తగ్గడంతో దిగువకు వరద జలాల విడుదలను 3,175 క్యూసెక్కులకు పరిమితం చేశారు. దీంతో ఆదివారం సాయంత్రం వరద ఉధృతి తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. శనివారం వరకు 6,175 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లోస్ ఆదివారం ఉదయం 6 గంటలకు 4,806 క్యూసెక్కులకు తగ్గగా, 9 గంటలకు 3,145 క్యూసెక్కులు, 11 గంటలకు 2,935 క్యూసెక్కులు, సాయంత్రం 4 గంటలకు 1,687 క్యూసెక్కులు, 6 గంటలకు 1,784 క్యూసెక్కులుగా ఉన్నాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు 6,175 క్యూసెక్కులుగా ఉన్న అవుట్‌ఫ్లోస్‌ను సాయంత్రానికి 3,175 క్యూసెక్కులకు తగ్గించారు. స్పిల్‌వే ద్వారా 2,400, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తుండగా, విశాఖ అవసరాలకు 1750 క్యూసెక్కులు పంపుతున్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.63 మీటర్లు ఉండగా, నీటి నిల్వలు 22.22 టీఎంసీలు ఉన్నాయి.



ఏలేరు జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదల చేసున్న నీటి ప్రవాహం పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో ఉధృతంగానే ఉంది. కాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతో వాటి నుంచి వస్తున్న వరద నీరు పంట పొలాల్లోకి చేరుతోంది. ఫలితంగా వరి చేలల్లో నీరు ఇంకా అలాగే ఉంది. పూర్తిస్థాయిలో తగ్గేందుకు మూడు రోజుల సమయం పడుతుందని రైతులు తెలిపారు. వరద ఉధృతికి కాలువలు పలుచోట్ల కోతకు గురికావడంతో పాటు గండ్లు పెద్దవిగా మారుతున్నాయి. వీటిని తక్షణం పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోతే ముంపు తగ్గదని చెప్తున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పోలీసులు

కాకినాడ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఎస్‌ఐ, మరో కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. కాకినాడ డైరీఫారం సెంటర్‌కు చెందిన ఓ మహిళ వైవాహిక జీవితంలో చోటుచేసుకున్న వివాదాలతో తన భర్తపై గత నెల 13న గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఎస్పీ దర్యాప్తు చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని మహిళా పోలీసులకు సిఫార్సు చేశారు. కేసు విచారణను ఎస్‌ఐ వాడపల్లి ఆంజనేయరాజు చేపట్టారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భర్తకు అండగా నిలిచాడు. కేసు విచారణ తాను చూసుకుంటానని భరోసా ఇచ్చి అతడి నుంచి రూ.20వేలు లంచం వసూలు చేశాడు. ఈ మొత్తాన్ని అక్కడే పనిచేస్తున్న కానిస్టేబుల్ జుత్తుక శ్రీనివాసరావు అందుకుని ఎస్‌ఐకు అందజేశాడు. ఈ ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాన్ని బాధితురాలు ప్రత్యక్షంగా చూసింది. అనంతరం ఆమె ఎస్పీని ఆశ్రయించి జరిగిన విషయాన్ని ఫిర్యాదు రూపంలో ఇచ్చింది. ఈ వ్యవహారంపై ఎస్పీ అంతర్గత విచారణ చేపట్టారు. వాస్తవాలు నిగ్గుతేలడంతో ఎస్‌ఐ, కానిస్టేబుల్‌లను బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

దేవరపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో మోటారు సైకిస్టు దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం రంగరాయ కాలనీకి చెందిన షేక్ ఇమామ్ (50) రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనిమీద బైక్‌పై బయల్దేరాడు. ఏలూరు నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న అతడిని మండలంలోని దుద్దుకూరు సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన వ్యాన్ ఢీకొంది. కిందపడిన ఇమామ్ తల డివైడర్‌కు తగలడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే కన్నుమూశాడు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.



మృతుడు షేక్ ఇమామ్ (పాత చిత్రం)

రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు

కొంకాపల్లికి చెందిన శ్రీను హత్య కేసులో నిందితుల కోసం విస్తృత గాలింపు

పోలీసుల అదుపులో నలుగురు ప్రధాన నిందితులు: సోషల్ మీడియాలో ప్రచారం

అమలాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్య కేసును ఛేదించేందుకు ఎస్పీ రాహుల్‌మీనా పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. శ్రీనివాస్‌ను అతి కిరాతకంగా హత్య చేసిన అనంతరం ప్రధాన నిందితులు అదే రోజున దేశంలోని వివిధ ప్రధాన ప్రాంతాలకు వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో కీలక ప్రాంతాల్లో ఉన్న నలుగురు ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని పోలీసులు చెప్తున్నారు. శ్రీనివాస్ హత్య అనంతర పరిణామాలపై పట్టణ పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులు పోలీసుల అదుపులోకి చేరినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వామిమాలలో ఉన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం మృతుడు శ్రీనివాస్ భార్య దేవితో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. హత్యకు కారకులైన వారిని అరెస్టు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లి గోదావరిలో లభ్యమైన శ్రీనివాస్ మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక ఇంతవరకు అందలేదని, దాని ఆధారంగా కేసులో దర్యాప్తును కీలకంగా మార్చుకునే అవకాశం ఉంటుందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

ఈలకొలనులో వ్యక్తిపై హత్యాయత్నం: ఐదుగురి అరెస్టు

రంగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలనులో ఒక వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు. రంగంపేట ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం... రంగంపేట మండలం ఈలకొలనుకు చెందిన నులుకుర్తి వీరలక్ష్మి తన పేరిట వున్న సుమారు 9 ఎకరాల పామాయిల్ తోటను కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన తన తండ్రి టేకుమూడి వీర వెంకట సత్యనారాయణకు ఈ ఏడాది ఆగస్టులో రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ నెల ఒకటో తేదీన ఆయన కొంతమంది పనివాళ్లను, మనుమడిని తీసుకుని పామాయిల్ తోటలోకి వెళ్లి గెలులు కోయించాడు. వాటిని ట్రాక్టర్లోకి ఎక్కిస్తుండగా రాజానగరం మండలం సూర్యారావుపేటకు చెందిన దొండపాటి దుర్గ, కొవ్వూరి సత్యనారాయణ, కొవ్వూరి బాబి, యాళ్ల రామారావు, రాధేయపాలేనికి చెందిన మేడిశెట్టి నరసింహమూర్తి అడ్డుకున్నారు. ఈ తోట నులుకుర్తి ముత్యమాధురి, సాల్మన్‌రాజులకి చెందినదని, ఇందులో మీరు ఎందుకు గెలలు కోస్తున్నారని పై ఐదుగురు ప్రశ్నించారు. గెలలు కోయడానికి ఎవరైనా వస్తే వారి అంతు చూడాలని తమతో చెప్పారన్నారు. ముందుగా తెచ్చుకున్న కర్రలతో టేకుమూడి సత్యనారా యణను చంపేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన మనువడు, స్నేహితులు అడ్డుకోవడంతో తృటిలో తప్పించుకున్నారు. మూడు నెలల క్రితం పై వ్యక్తులు వేళంగిలోని తన ఇంటికి వచ్చి తనను, తన కుమారైను చంపేస్తామని బెదిరించారన్నారు. శనివారం హత్యాప్రయత్నం చేశారని రంగంపేట పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దొండపాటి దుర్గ, కొవ్వూరి సత్యనారాయణ, కొవ్వూరి బాబి, మేడిశెట్టి నరసింహమూర్తి, యాళ్ల రామారావులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఎస్‌ఐ చెప్పారు.

సహచరుడి మరణం కలచివేసింది

రాష్ట్ర స్థాయి అవార్డును నిరాకరించిన విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్



అంతర్వేది/మలికిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మండలం సఖినేటిపల్లి మండలంలో వందలాది విద్యుత్ స్తంభాలు విరిగిపడి వాటిపై కొబ్బరిచెట్లు పడిపోయాయి. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించి 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తుఫాన్ సహాయ చర్యల్లో కష్టపడిన విద్యుత్ శాఖ సఖినేటిపల్లి, మలికిపురం మండలాల ఏఈ బొలిశెట్టి ప్రసాద్‌ను రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి నుంచి అవార్డు తీసుకునేందుకు ఆయన అమరావతి వెళ్లలేదు. దీనిపై ఏఈని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో తన పర్యవేక్షణలో పనిచేసిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యడ్ల శంకర్ ప్రమాదవశాత్తు మృతి చెందడం తనను కలచివేసిందని, తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయన్నారు. అతడి కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నప్పుడు అవార్డు తీసుకునేందుకు తన మనసు అంగీకరించలేదని ఏఈ చెప్పారు.



మత్స్యకారులకు చిక్కిన చేపలు

సూర చేపలివిగో...

ఉప్పాడ తీరంలో రూ.70 లక్షలు విలువైన మత్స్య సంపద లభ్యం

కొత్తపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో మత్స్యకారులకు సూర చేపలు లభ్యమయ్యాయి. ఇటీవల వరుస తుఫాన్లతో వారు ఇళ్లకే పరిమితమయ్యారు. మొంథా తుఫాన్ అనంతరం ఆదివారం వేటకు వెళ్లిన వారికి రూ.70 లక్షలు విలువైన సూర చేపలు దొరికాయి. దీంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఎవరీ యువతి!

ముమ్మిడివరం పరిసరాల్లో సంచారం



ముమ్మిడివరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని యువతి సంచరిస్తోంది. ఆమెకు మతిస్థిమితం లేదని స్థానికులు చెప్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్ల వెంబడి తిరుగుతోందని, గుర్తిస్తే సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని కోరుతున్నారు. అసలే పరిస్థితులు బాగోలేని దృష్ట్యా ఒంటరిగా తిరుగుతున్న యువతిని కాపాడేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

23వ రోజు దీక్షలు

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో బస్టాండు ఆక్రమణలు తొలగించి బస్టాండులోకి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 23వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని పలువురు సందర్శించి సంఘీభావం తెలిపారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవ పూజలు

అమలాపురంరూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఎ.వేమవరంలో వేంచేసి ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పూజలు, హోమాలు నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్లరమణబాబు పాల్గొన్నారు.

క్షీరాబ్ధి ద్వాదశి పూజలు.. దీపాలంకరణలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అమలాపురం టౌన్/రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమలాపురం గొల్లగూడెం బైపాస్ రోడ్డులోని శ్రీకృష్ణ మందిరం వద్ద కార్తీకమాసాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో శివకేశవులకు అబేధం లేదంటూ ఆలయం వద్ద క్షీరాబ్ధి ద్వాదశ పూజలు జరిపించారు. మహిళా భక్తులు పాల్గొని ద్వాదశ పూజలు చేశారు.రాత్రి ఆలయం వద్ద అఖండ దీపాలంకరణ నిర్వహించారు. చిన్నికృష్ణ రూపాలతో జరిపిన రూపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. రెడ్డిపల్లిలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని లక్షపత్రి పూజ నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద గణపతి హోమం నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్, మాజీ సర్పంచ్ కరాటం సూర్యభాస్కరరావు, కొలిశెట్టి జయప్రకాష్, నిమ్మకాయల రాంబాబు, రేలంగి ముకుందరావు, కంచర్ల బాబులు తదితరులు పాల్గొన్నారు. శివాలయం వద్ద విశేష దీపాలంకరణ జరిపించారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): పొదలాడ శివాలయంలో శ్రీరామశెట్టిబలిజ సంఘం, శ్రీగణపతి శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో క్షీరాబ్ధిద్వాదశి పరస్కరించుకుని ఆదివారం లక్షపత్రి పూజ అత్యంత వైభవంగా జరిగింది. లక్షపత్రి పూజా కార్యక్రమాన్ని అర్చకులు మానేపల్లి చినబాబుచే పూజా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు లక్షపత్రి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, సర్పంచ్ కడలి సత్యనారాయణ, బి.సావరం సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల కుశులుడు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల కృష్ణ, వాసంశెట్టి రామకృష్ణ, పాటి సత్యనారాయణ, చెరుకూరి రామకృష్ణ, కాండ్రేగుల షణ్ముఖప్రసాద్ పాల్గొన్నారు.



అమలాపురం: గొల్లగూడెం బైపాస్ రోడ్డులోని శ్రీకృష్ణాలయంలో విశేష దీపాలంకరణలు

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా క్షీరాబ్ది ద్వాదశ పూజలు మండలంలోని పలు ఆలయాల వద్ద ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టు కొమ్మను తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. క్షీరాబ్ధి ద్వాదశి నాడు తులసి, ఉసిరి చెట్టుకు కల్యాణం జరిపించడం ఆనవాయితీ. ఇలాచేస్తే సకల కోరికలు, నెరవేరుతాయని, అష్టైశ్వర్యాలు సమకూరుతాయని భక్తుల నమ్మకం. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆదివారం భక్తిప్రపత్తులతో మహిళలు క్షీరాబ్ధి ద్వాదశ పూజలు చేశారు. శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అల్లవరం, రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, గోడి, గోడిలంక, బోడసకుర్రు, కొమరగిరిపట్నం, దేవగుప్తం, తాడికోన పరిసర గ్రామాల్లో శివాలయాల వద్ద క్షీరాబ్ధి ద్వాదశి పూజలు చేశారు. తులసి చెట్ల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. శివాలయాలకు పోటెత్తిన మహిళలు జ్యోతిర్లింగార్చనలు నిర్వహించారు.



ముమ్మిడివరం: చినకొత్తలంకలో శ్రీపట్టాభిరామ స్వామి ఆలయంలో అలంకరించిన దీపాలు

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా మండలంలోని పలు శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. పువ్వులు, పండ్లు, తులసీ దళాలతో స్వామివారిని పూజించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు ఉపవాసం ఆచరించి పాలు, బెల్లంతో చేసిన క్షీరాన్నాన్ని స్వామివారికి ప్రసాదంగా నివేదించారు. తులసి చుట్టూ దీపాలు వెలిగించి ప్రత్యేక భజనా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లిలోని పార్వతీ సమేత చౌడేశ్వర లోకేశ్వరస్వామి, అయినాపురంలోని ఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లిలోని పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంకలోని ఉమాభోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడిలోని ఉమాల వల్లభేశ్వరస్వామి, రాణేలంకలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలతో పాటు పల్లిపాలెంలోని శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయం, చినకొత్తలంకలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

● ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు
● తుఫాన్ బాధితులకు సహాయం పింపిణీ

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. రాణేలంలోని వ్యవసాయ పరపతి సహకార సంఘంకార్యాలయంలో గ్రామంలో106మంది బాధితులకు నిత్యావసరాలు, రూ.2.86లక్షల నగదు అందించారు. ఒక్కో కుటుంబంలో ఒక్కరు, ఇద్దరు ఉంటే రూ.వెయ్యి, ముగ్గురు పైబడి ఉంటే రూ.3వేలు వంతున సాయం అందించామన్నారు. కార్యక్రమంలో అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్, బొక్కా సత్యనారాయణ, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, ఇసుకపట్ల ఈశ్వర్, చింతలపూడి సూర్యనారాయణ, బొంతు శ్రీనివాసరావు, పల్ల రాజబాబు, కొప్పిశెట్టి శేఠ్, దంగేటి శ్రీనివాసరావు, వనచర్ల బాలకృష్ణ, నిట్ల శ్రీనివాసరావు, చింతలపూడి కొండబాబు, యలమంచిలి బాలరాజు, గోదశి గణేష్, బద్రి రమా, కర్రి శ్రీను, చింతలపూడి ప్రసాద్, తహశీల్దార్ తాడి సుభాష్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం జి.మూలపొలం, కేశనకుర్రు గ్రామాల్లో మొంథా తుపాను బాధితుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులను బాధిత కుటుంబాకు అందించారు. మత్స్యకారులకు, నేత కార్మికులకు 50కేజీల బియ్యం, లీటరు పామాయిల్, కందిపప్పు, కూరగాయలు, పంచదార పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, పార్టీ మండలాధ్యక్షుడు సాగిరాజు సూరిబాబు రాజు, తెలుగు యువత అధ్యక్షుడు కాకర్లపూడి రాజేష్, సర్పంచ్‌లు లంకలపల్లి దుర్గాదేవీముని రాజు, బీర సత్యకుమారి, సొసైటీ చైర్మన్లు పెంట రవిప్రసాద్, చిక్కాల శ్రీనివాస్, నీటి పంపిణీ సంఘం చైర్మన్ చిలువూరి సుబ్బరాజు, నీటి సంఘం చైర్మన్ చోడిశెట్టి నాగబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం: బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ కారణంగా పొన్నమండలో పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు నిత్యావసరాలు, నగదును గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కడలి శ్రీదుర్గ ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా చైర్మన్ గుబ్బల మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు 25కిలోల బియ్యం, రూ.3వేలు, నిత్యావసరాలు అందజేశామన్నారు.ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా కూటమి ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి ప్రజల రక్షణ కోసం ముందస్తు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సర్పంచ్ కుక్కల బేబీకుమారి, ఎంపీటీసీ మోకా ఉష, గ్రామశాఖ అధ్యక్షుడు దాకే ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి కడలి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీలు కడలి అబ్బు, మామిడిశెట్టి సత్యనారాయణ, ఎనిమిదో క్లస్టర్ కడలిమోహన్, అప్పారి వీరవెంకటసత్యనారాయణ, కుసుమ రాజ్‌కుమార్, బొక్కా సత్యనారాయణ, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



రాజోలు: పొన్నమండలో నిత్యావసరాలు అందజేస్తున్న సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న కుటుంబాలకు ఆదివారం గొల్లవిల్లి పంచాయతీ కార్యాలయంలో సహాయం అందించారు. బాధితులకు రూ.1,000, రూ.3,000 వంతున తెలుగుదేశం మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ నగదు పంపిణీ చేశారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసు, నీటి సంఘం చైర్మన్ నల్లా సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ మంచెం బాలకృష్ణ, అడబాల సత్యనారాయణ, మద్దింశెట్టి సీతారామస్వామి, వీఆర్వో వి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎండీ షెహన్‌షా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలందించాలి



హైకోర్టు న్యాయమూర్తి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత న్యాయసేవలు అందిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి సహకారం అందించాలని హైకోర్టు జడ్జి జగడం సుమతి పేర్కొన్నారు. ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆదివారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జి సుమతి దంపతులను సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ న్యాయవాదులకు దశ, దిశా నిర్దేశం చేస్తూ న్యాయ వ్యవస్థ ద్వారా పేదలకు ఉచిత సేవలు అందించేందుకు 42వ రాజ్యాంగ సవరణ కల్పించిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా, అమలాపురం ప్రత్యేక కోర్టు జడ్జి పీవీ సత్యనారాయణ, బార్ సెక్రటరీ మట్టపర్తి సత్యనారాయణ, న్యాయవాదులు రెడ్డి సత్యనారాయణమూర్తి, కుచ్చర్లపాటి తాతంరాజు, బీర ప్రసాద్‌బాబు, కాశి బాబు, కాశి బాబూజగ్జీవన్‌రామ్, తటవర్తి నాగరాజారావు, కాశి సిద్ధార్థకుమార్, తిరుకోటి శాంతిసుధ, రెడ్డి మిత్రలతో పాటు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మహాశాంతి హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ అంతర్వేదిలో తీరం దాటిన సందర్భంలో తీర ప్రాంత గ్రామాలను, ప్రజలను అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి రక్షించారన్న భక్తుల విశ్వాసంతో ఈమహాశాంతి హోమాన్ని మంగళవారం అర్చకుల సారథ్యంలో జరుగుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మహాశాంతి హోమం ఏర్పాట్లపై అధికారులు, కూటమి శ్రేణులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలు నియోజకవర్గం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజలంతా ఈహోమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు అందుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఆకన బాబ్జినాయుడు, ముప్పర్తి నాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

అయినవిల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరంలో గల శ్రీముక్తికాంత క్షణ ముక్తీశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. ఆదివారం అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితులు అవధాని ఆధ్వర్యంలో ముక్తికాంతం క్షణముక్తీశ్వరస్వామివారికి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, స్వామివారికి శాంతి కల్యాణం, రుద్ర హోమం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని దీపారాధనలు ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలకంరణలో క్షణముక్తీశ్వరస్వామి

అమలాపురంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు



బ్లాక్ బెల్టును సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన రామకృష్ణ తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎర్రవంతెన వద్ద నల్లా బ్రహ్మానందం కాంప్లెక్సులో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. పవర్ కిక్ షోటోకాన్ కరాటే డూ అసోసియేషన్ నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో అమలాపురం పవర్‌కిక్ కరాటే స్కూలుకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారని చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. బ్లాస్టార్స్ షోటోకాన్ కరాటే డూ ఇండియా చీఫ్ ఇనస్ట్రక్టర్ మధు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి కరాటే బెల్టులు, ప్రశంసా పత్రాలను ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.శ్రీమన్నారాయణ అందజేశారు. ఈపోటీలకు ఎగ్జామినర్‌గా చిక్కం సురేష్ వ్యవహరించారు. బెల్టు గ్రేడింగ్ పోటీల్లో నందుల షణ్ముక్, నందుల ప్రణయ్, అడపా రవిశంకరి, బండారు మోహన్, పామర్తి ఇందుప్రియ, అడబాల వినయ్, యల్లమిల్లి అన్వేష్, సరిదే వర్షిత్‌లు బ్లాక్ బెల్ట్‌లు సాధించగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డాక్టర్ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో అంజి, రామకృష్ణ, సురేష్‌లను ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే దేవను సత్కరించిన తహశీల్దార్లు



మలికిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మలికిపురం, సఖినేటిపల్లి తహశీల్దార్లు టి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావులు దుశ్శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. మీ మార్గదర్శకత్వంలో నియోజకవర్గంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా పనిచేశామని, దానికి మీ తోడ్పాటే ముఖ్య కారణమని తహశీల్దార్లు ఎమ్మెల్యేను అభినందించారు.

కాశీబుగ్గ మృతులకు వైసీపీ నివాళులు

అమలాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంలో జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. హైస్కూలు సెంటర్ నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు జరిగిన ర్యాలీకి నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ నాయకత్వం వహించారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, గన్నవరపు శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్ కుడుపూడి సూర్యనారాయణ, రాష్ట్ర జిల్లా నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. సంఘీభావంగా పలువురు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

అవినీతిని కలిసికట్టుగా నిర్మూలిద్దాం

● సీబీఐ ఆధ్వర్యంలో యానాంలో వాక్‌దాన్

యానాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీబీఐ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం యానాంలో వాక్‌దాన్, వర్కషాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన సీబీఐ, ఏసీబీ ఆధ్వర్యంలో యానాంలో జరిగిన కార్యక్రమంలో యానానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారాలు పాల్గొన్నారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం వద్ద వాక్‌దాన్‌ను ఆర్‌ఏ అంకిత్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అవినీతిని కలిసికట్టుగా నిర్మూలించాలని పేర్కొన్నారు. అనంతరం చింతావారివీధి నుంచి ఎస్‌బీఐ రోడ్డు, పిల్లారాయవీధి మీదుగా వాక్‌దాన్ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వర్కషాప్ నిర్వహించారు. సీబీఐ అడిషనల్ ఎస్పీ దాస్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, సుధీర్‌కుమార్, నరేష్, హరిబాబు, యానాం ఎస్పీ వరదరాజన్, ఎస్ఐలు పునిత్‌రాజ్, కట్టా సుబ్బారాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఐ.పోలవరం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): బాణాపురంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఆదివారంజిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజని పరామర్శించారు. బాలిక కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. బాలికలపై అత్యాచారానికి పాల్పడుతున్న వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

డిజిటల్ సిగ్నేచర్ కోసం ఎదురుచూపులు!

కాట్రేనికోన, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలో లబ్ధిదారులు తమ సర్టిఫికెట్లపై డిజిటల్ సిగ్నేచర్ కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. తహసీల్దార్ మారిచాలా రోజులైనా డిజిటల్ సిగ్నేచర్ మారకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎన్నోరోజులుగా డిజిటల్ సిగ్నేచర్ లేక వందల సంఖ్యలో దరఖాస్తులు, ధ్రువీకరణపత్రాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈసమస్యను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

లూథరన్ హైస్కూలు కరస్పాండెంట్ మృతి

అంతర్వేది, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి లూథరన్ హైస్కూలు కరస్పాండెంట్, వైసీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. సఖినేటిపల్లి లూథరన్ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణచేసి లూథరన్ హైస్కూలులో కరస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రేమానందం మృతికి మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, రాపాక వరప్రసాద్, స్థానిక నాయకులు, హైస్కూలుయాజమాన్యం సంతాపం తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాస్ తదితరులు

అమలాపురంటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అమలాపురం రోటరీ క్లబ్ సౌజన్యంతో శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లానుంచి హాజరైన 80మంది విద్యార్థులకు వయసు, బరువును బట్టి కేటగిరీల వారీగా పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా పి.సతీష్‌రెడ్డి, వెంకయ్యనాయుడు, కె.మాధవయ్య వ్యవహరించారు. పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో డి.కార్తీక్, ఎ.తేజస్విని, బి.హర్షవర్ధన్, పి.సూర్య, పి.సాయిదివ్యాన్స్, వై.రితిక, జి.ఆదిత్యవర్ధన్,టి.రేణుకలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు యోగాగురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ప్రకటించారు.

గ్రంథాలయ శాఖ నూతన కమిటీ ఏర్పాటు

ముమ్మిడివరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయశాఖ ముమ్మిడివరం మండల అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా విళ్ల వీరాస్వామినాయుడు, ఉపాధ్యక్షుడిగా జాగు రాంబాబు, కార్యదర్శిగా శీలం వెంకటరమణ, ఉప కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, కన్వీనర్, లైబ్రేరియన్‌గా శీలం నాగరాజు, సభ్యులుగా టి.సుబ్బారావు, పి.విజయ్‌కుమార్, అరిగెల నాగేంద్ర, పోలిశెట్టి కృష్ణ, సబ్బితి సత్యనారాయణ, నిమ్మకాయల విస్సు ప్రమాణ స్వీకారం చేశారు. లైబ్రరీ అభివృద్ధికి, స్థలాన్ని సమకూర్చి భవన నిర్మాణానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు అన్నారు.

పొనుగుమట్లకు కవితా పురస్కారం

యానాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యానానికి చెందిన కవి, పాత్రికేయుడు పొనుగుమట్ల అశోక్‌కుమార్ కవితా పురస్కారానికి ఎంపికయ్యారు. మల్లెతీగ సాహిత్య సేవసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ నుంచి సమాచారం అందినట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సౌజన్యంతో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వహించిన కవితల పోటీల్లో అశోక్ రాసిన కవిత కన్సోలేషన్ విభాగంలో బహుమతికి ఎంపికైంది. ఈనెల22,23 తేదీల్లో విజయవాడలో జరిగే జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో జ్ఞాపిక, నగదు బహుమతి అందించి సత్కరించనున్నారు.

తుఫాన్ బాధితులకు సాయం పంపిణీ

అమలాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సవరప్పాలెంలో పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన మొంథా తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు, ఆర్థికసాయాన్ని ఏఎంసీ వైస్‌చైర్మన్ పరమట చిట్టిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి నాగేశ్వరమ్మ, నాయకులు సత్తి అనిల్, సత్తి రాంబాబు, కార్యదర్శి సూరిబాబు, వీఆర్వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రెడ్డిపల్లిలో తుఫాన్ బాధితులకు సర్పంచ్ కరాటం రత్నప్రసన్న ఆధ్వర్యంలో నిత్యావసరాలతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.3వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యదర్శి కె.గణపతి, వీఆర్వో గంధం దొరబాబు, నల్లాసతీష్ పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా చీకట్ల

యానాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యానాం శెట్టిబలిజ సంఘ నూతన అధ్యక్షుడిగా వ్యాపారవేత్త చీకట్ల సత్యనారాయణ(మాస్టరు) ఎన్నికయ్యారు. స్థానిక జీవీఎస్ ఫంక్షన్ హాలులో సంఘ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా చీకట్ల సత్యనారాయణ, ఉపాధ్యాక్షుడిగా కాకి నాగేశ్వరరావు, చింతాకులు రామకృష్ణ, నక్కల భువనేశ్వరరావు, చీకట్ల రామకృష్ణ, కోశాధికారిగా సూరంపుడి గిరీష్, కార్యదర్శిగా గెద్దాడ శ్యాంకుమార్, సంయుక్త కార్యదర్శిగా బొక్క వెంకన్నబాబు, పలువురు ఎగ్జిక్యూటీవ్ మెంబర్లగా ఎన్నికయ్యారు. ఈనెల15న శెట్టిబలిజ సంఘం వనసమారాధన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ముమ్మిడివరం మాజీ మార్కెటింగ్ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, గుత్తుల గోవిదంగ జయరామరావు, పితాని భాస్కర్, పిల్లి త్రిమూర్తులు, దంగేటి త్రిమూర్తులు, మాట్లాడార కార్యకర్గ సభ్యులకు ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభినందనలు తెలిపారు.

ఎస్.యానాంలో కోటి సంతకాల కార్యక్రమం

ఉప్పలగుప్తం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్.యానాంలో కోటి సంతకాల కార్యక్రమం, రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, పార్టీ మండలాధ్యక్షుడు బద్రి బాబ్జి, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, పార్టీ జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీను, జిన్నూరి వెంకటేశ్వరరావు, గెడ్డం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన

మలికిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పలువురి మధ్య సంఘీభావానికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి తదితర నాయకులు పాల్గొన్నారు.

బండారుకు సత్కారం

ఆలమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇటీవల సీఎం చంద్రబాబు నుంచి సేవాపురస్కారం అందుకున్న సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యేను ఆలమూరు యూటీఎఫ్ నాయకులు సత్కరించి అభినందించారు.

మండపేట

వైభవంగా లక్ష బిల్వార్చన

అయినవిల్లి (ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరంలో గల ముక్తికాంత క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆదివారం అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితులు అవధాని ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, స్వామివారికి శాంతి కల్యాణం, రుద్ర హోమం నిర్వహించారు.



ఆలమూరు మండలం నర్సిపూడిలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



రాయవరం మండలం వెదురుపాకలో క్షీరాబ్ధి ద్వాదశి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

భక్తిశ్రద్ధలతో క్షీరాబ్ధి ద్వాదశి పూజలు

రాయవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం రాత్రి క్షీరాబ్ధి ద్వాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. గాడ్ కుమార్తెలు గాదే సత్య వెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనకదుర్గ ఆధ్వర్యంలో తులసి, ఉసిరి చెట్లు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు కె.శివ ఆధ్వర్యంలో వినాయకపూజ, గౌరి, లక్ష్మి, తులసి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు నిర్వహించి నక్షత్ర హారతులు, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన నిర్వహించారు. వెదురుపాక జనార్దనస్వామి ఆలయంలో అంగర సూర్యనారాయణాచార్యులు, జనార్దన్ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు క్షీరాబ్ధి ద్వాదశి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీఠంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాడ్రేవు సూర్య రాజ్యలక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రావులపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ఆలయాలు, గృహాల వద్ద క్షీరాబ్ధి ద్వాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఇంటి వద్ద మహిళలు ఉసిరికొమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వైభవంగా కార్తీక దీపోత్సవం

ఆలమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నర్సిపూడిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కార్తీకమాస దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవానికి ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో దీపోత్సవంలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. కార్తీక దీపోత్సవానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు పలువురు నాయకులు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దీపోత్సవంలో ఇబ్బందులు రాకుండా ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

తులసీ దామోదర పూజలు: ఆలమూరు మండలం గుమ్మిలేరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస తులసీ దామోదర, ధాత్రి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీకమాసం ద్వాదశి సందర్భంగా ఆల యంలో ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామానికి చెందిన రెడ్డి వీరవెంకట సందీప్ దంపతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తుల అధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

స్వామివారి చిత్రపటాల బహూకరణ: ఆలమూరులోనున్న జనార్దనస్వామి ఆలయానికి దాతలు స్వామివారి చిత్రపటాలను బహూకరించారు. ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే తోమాల సేవ, స్వామివారి అలంకరణ చేయించే దాతలకు వాటిని అందించాలని కోరారు. కొత్తూరు సెంటర్‌కు చెందిన పసుపులేటి దుర్గా ప్రసాద్ దంపతులు ఆదివారం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు అధ్వర్యంలో ఆలయానికి వాటిని అందించారు. ట్రాన్స్‌కో డీఈఈ ఎస్. శ్రీధర్ చేతుల మీదుగా వాటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆదివారం సందర్భంగా మండలంలోని పలు పుణ్యక్షేత్రాలు భక్తజనంతో పోటెత్తాయి. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయాల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. క్షీరాబ్ధి ద్వాదశి కావడంతో స్వామివారికి భక్తజనం పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ జరిపారు. అనంతరం స్వామివారి అన్న ప్రసాదంలో భక్తజనం పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయం, వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆయా పర్యాటక కేంద్రాల వద్ద సందడి నెలకొంది.



భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభలో మంత్రి ప్రసంగించారు. జీఎస్‌టీ తగ్గింపుతో భవన నిర్మాణ కార్మికులకు మేలు చేసిందన్నారు. భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఉచిత ఇసుక విధానం ప్రారంభించామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు అప్పారి శ్రీనివాస్, గానాల సత్యసాయి, రామోజీ శ్రీనివాస్, దర్నాసనం రామకృష్ణ తదితరులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన్ను భవన నిర్మాణ కార్మికులు సత్కరించారు.



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం రూ.7లక్షలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పార్టీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు వీరారెడ్డి, రామచంద్రపురం డీసీ కమిటీ చైర్మన్ ఎస్.సత్యనారాయణ రెడ్డి, ఎం.రవీంద్రా రెడ్డి, మేకా జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.



జనార్దనస్వామి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా జనార్దనస్వామి తెప్పోత్సవం

మండపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మండపేటలోనున్న అగస్తేశ్వరస్వామి తెప్పోత్సవాన్ని ఆదివారం రాత్రి అశేష భక్తజనం మధ్య ఘనంగా నిర్వహించారు. రథం గుడిలోనున్న జనార్దన స్వామివారిని తొలుత పట్టణ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులను బూరుగుంట చెరువులో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెప్పపై ఊరేగించారు. ఈ తెప్పోత్సవాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయనతోపాటు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, రెడ్డి రాజబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, మున్సిపల్ కౌన్సిలర్‌లు శిరంగు జ్యోతి, కాశీన కాశీవిశ్వనాథం, కాళ్లకూరి స్వరాజ్యభవాని తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ర్యాలిలో అయ్యప్పస్వాముల ఊరేగింపు

అయ్యప్ప భక్తుల గ్రామోత్సవం

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ర్యాలి గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వాములు భారీ ఊరేగింపు నిర్వహించారు. కేరళ వాయిద్యాలతో జ్యోతి వాహనంలో స్వామివారిని అలంకరించి ఊరేగింపు జరిపారు. తేటతుళ్లి ఆడుతూ సందడి చేశారు. హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ అర్చకులు రఘు, ఫణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఊరేగింపులో అయ్యప్ప భక్తులు పాల్గొనగా, శరణుఘోషతో ఆయా ప్రాంతాలను హోరెత్తించారు.

ఎమ్మెల్యే బండారుకు సత్కారం

ఆలమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యేను ఆలమూరు యూటీఎఫ్ నాయకుల అధ్వర్యంలో సత్కరించి అభినందించారు. తుఫాన్ సహాయక చర్యల ఏర్పాట్లలో ఎమ్మెల్యే చేసిన సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు అద్దరి శ్రీనివాసరావు, లోకేష్, పీవీజీఎస్ ఎన్‌మూర్తి, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తుఫాను బాధితులకు నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి

తుఫాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండ

కె.గంగవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని కోనసీమ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి అన్నారు. ఆదివారం ఆయన యండగండి గ్రామంలో తుపాను బాధితులకు నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మార్ని శ్రీధర్, నాయకులు వాసంశెట్టి సాయిబాబు, వీఆర్‌వో పామర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

కె.గంగవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరి వేటలో ప్రమాదవశాత్తూ మరణించిన పెమ్మాడి నూకరాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గత వారం గోదావరిలోకి వేటకు వెళ్లిన నూకరాజు ప్రమాదవశాత్తు గల్లంతైన సంగతి తెలిసిందే. ఆదివారం యానాం పరసర ప్రాంతాల్లో మృతదేహం లభించగా, కోటిపల్లి మత్స్యకార కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వం అండగా ఉంటుంది: గోదావరిలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించిన నూకరాజు కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) అన్నారు. ఆదివారం కోటిపల్లి మత్స్యకార కాలనీలో బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





రావులపాలెంలో క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. పక్క చిత్రంలో మహిళల క్రికెట్ టోర్నీలో భారత్ విజయం సాధించాలని పూజలు నిర్వహించిన మహిళా కూటమి నేతలు

భారత్ మహిళా జట్టు విజయం సాధించాలి

రావులపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మహిళా క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ సందర్భంగా రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బిగ్‌స్క్రీన్ వద్ద క్రికెట్ మ్యాచ్‌ను ఆయన తిలకించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో సైతం మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తుండటం గర్వకారణమన్నారు. తొలుత పలు ఆలయాల్లో మహిళా క్రికెట్ జట్టు ఫైనల్ విజయం సాధించాలని కోరుతూ నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు యల్లమిల్లి చంద్రకుమారితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహిళా నేతల ప్రత్యేక పూజలు

కొత్తపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళల వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ భారత్-సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న నేపథ్యంలో భారత్ విజయం సాధించాలని కోరుతూ ఆదివారం పలివెల ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆల యంలో కూటమి మహిళా నేతలు ప్రత్యేక పూజలు జరిపారు. టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యల్లమిల్లి చంద్రకుమారి ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు.

ప్రపంచ కప్ గెలవాలని పూజలు

ఆలమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ ప్రపంచకప్‌లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆలమూరు నవజనార్దనస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. సౌతాఫ్రికాతో ఆదివారం జరుగుతున్న మ్యాచ్‌లో భారత్ జట్టు విజయం సాధించాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బైరిశెట్టి రాంబాబు, ఈదల నల్లబాబు, ఈదల రాంబాబు, కేతా రాంబాబు, చీపురుపల్లి గణేష్, మానేపల్లి శ్రీనివాస్, వంటపాటి అర్జున్, బొమ్మ ప్రసాద్, నెల్లి చిన్న, దుడ్డు రాము, జిన్న భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన సహస్ర దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు

ఘనంగా సుదర్శన సహస్ర దీపాలంకరణ

ద్రాక్షారామ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం నరసాపురపుపేటలోనున్న వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం సుదర్శన సహస్ర దీపాలంకరణ జరిగింది. ఉదయం తులసి దాత్రి సహిత లక్ష్మీనారాయణ పూజా కార్యక్రమాన్ని అర్చకులు చక్రవర్తుల వేణుగోపాల్ నిర్వహించారు. సాయంత్రం భక్తులతో అలంకరించిన సుదర్శనస్వామి రూపాన్ని పూజించి వెయ్యి దీపాలతో సహస్ర దీపాలంకరణ జరిపారు. భక్తుల సహకారంతో కార్తీక సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చలికి వీర లక్ష్మీ, భవానీ శంకరస్వామి, ధర్మకర్తల మండలి చైర్మన్ మేడిశెట్టి వెంకట రమణ, చుండ్రు సూరిబాబు, మీనవల్లి దొరబాబు, వేములూరి సూరిబాబు, ఆలయ ఈవో వి.శ్రీనివాస్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీకలు వనసమారాధనలు

రాయవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. ఆదివారం చెల్లూరు గ్రామంలో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి వనసమారాధనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత కమ్మ మహాజన సంఘం ప్రతినిధులు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమ్మ మహాజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని పసలపూడి గ్రామంలో పద్మశాలి సామాజికవర్గం వనసమారాధన ఉల్లాసంగా ఉత్సాహ ంగా సాగింది. ఈసందర్భంగా చిన్నారుల సాం స్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిల్లలు, మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనం తరం పద్మశాలి సామాజిక వర్గంలో ఉత్తమ సేవలు అందించిన పలువురిని సత్కరించారు.





చెల్లూరు కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న ఏపీఐడీసీ చైర్మన్ లీలాకృష్ణ. పక్క చిత్రంలో పసలపూడి కార్తీక వనసమారాధనలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



రాయవరంలో ఎర్రన్నాయుడు జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల

ప్రజల మనస్సులో నిలిచిన నేత ఎర్రన్నాయుడు

రాయవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన కింజరపు ఎర్రన్నాయుడు ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచారని అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం రాయవరంలో మండపేట, అనపర్తి నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్‌నేత, కేంద్ర మాజీ మంత్రి కింజరపు ఎర్రన్నాయుడు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, జోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడిన నేత అని కొనియాడారు. తొలుత స్థానిక తుల్యభాగ కాలువ వంతెన వద్ద ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహానికి వారు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మండపేట, అనపర్తి నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘాల నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గోదావరి రేవులో హోటల్ దగ్ధమైన నేపథ్యంలో వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను) అన్నారు. ఆదివారం ఆయన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన హోటల్‌ను పరిశీలించారు. హోటల్ యజమాని వళ్లెం భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5000 నగదు, 25 కిలోల బియ్యం, దుప్పట్లు, కూరగాయలు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ పంపన నాగమణి పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబి, కూటమి నాయకులు కర్రి చిట్టిబాబు, మానే గంగాధర్, అయినవిల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న రేవు శ్రీను తదితరులు

గైడ్ కెప్టెన్స్ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో నేటి నుంచి 9వ తేదీ వరకు భారత్ స్కౌట్ అండ్ గైడ్ ప్రోగ్రాంలో భాగంగా గైడ్ కెప్టెన్స్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కోనసీమ జిల్లా సెక్రటరీ పిల్లి రాంబాబు తెలిపారు. ఆదివారం రాయవరంలో ఏఎంవో మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మి పర్యవేక్షణలో వారం రోజులపాటు ఈ శిక్షణ జరుగుతుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన 88 మంది గైడ్ కెప్టెన్స్ బేసిక్, అడ్వాన్స్ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నట్టు తెలిపారు. అడ్వాన్స్ ట్రైనింగ్‌కు హాజరయ్యే గైడ్ కెప్టెన్స్ బేసిక్ ట్రైనింగ్ సర్టిఫికెట్స్, బేసిక్ ట్రైనింగ్‌కు హాజరయ్యే గైడ్ కెప్టెన్స్ ఆధార్‌కార్డు జిరాక్స్, టెన్త్ సర్టిఫికెట్‌తో పాటుగా క్వాలిఫికేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. ట్రైనింగ్‌కు వచ్చే ఉపాధ్యాయినిలు వారం రోజులకు సరిపడా మందులు, వస్తువులను తీసుకురావాలన్నారు. ట్రైనింగ్‌కు హాజరయ్యేవారు సమయపాలన పాటించాలన్నారు. ట్రైనింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ది భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ పర్యవేక్షిస్తారన్నారు. ఈ శిక్షణను వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

కొత్తపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్‌షాపులు, సార స్థావరాలపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన అప్పారి శ్రీనును అదుపులోకి తీసుకుని 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పలివెలలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకుడు పిల్లా వెంకటేశ్వరరావును అరెస్టు చేసి 7 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేశారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కాత్యాయని తెలిపారు.